సాక్షి
యాదాద్రి భువనగిరి
శుక్రవారం । 1 । డిసెంబర్ । 2023



సొంతూళ్లకు ఓటర్లు..
ఇతర ప్రాంతాల్లో ఉంటున్న ఓటర్లు ఓటేసేందుకు సొంతూళ్లకు రావడంతో హైవేపై వాహనాల రద్దీ నెలకొంది. - 8లో



డీసీసీబీ చైర్మన్‌పై దాడి
ఆలేరు మండలం కొలనుపాకలో కొందరు వ్యక్తులు డీసీసీబీ చైర్మన్ మహేందర్‌రెడ్డి కారుపై రాళ్లు విసిరారు. - 8లో



ఈస్ట్‌కోస్ట్ ట్రైన్‌లో పొగలు
యాదగిరిగుట్ట మండలంలోని వంగపల్లి గ్రామ సమీపంలో ఈస్ట్‌కోస్ట్ ట్రైన్‌లోని ఓ బోగిలో పొగలు వ్యాపించాయి. - 8లో

న్యూస్‌రీల్

అందరికీ కృతజ్ఞతలు
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కె.జెండగె

సాక్షి యాదాద్రి : జిల్లాలోని ఆలేరు, భువనగిరి నియోజకవర్గాల్లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఇందుకు సహకరించిన రాజకీయ పార్టీలు, పోలీసులు, ఎన్నికల సిబ్బంది, మీడియా, ప్రజలకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కె. జెండగె కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ప్రత్యేక సెలవు
భువనగిరి టౌన్ : డిసెంబరు 1వ తేదీన స్పెషల్ క్యాజువల్ సెలవుగా ప్రకటిస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కె.జెండగే గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 29, 30 తేదీల్లో పోలింగ్ విధులు నిర్వహించిన స్కూల్ ఎడ్యుకేషన్, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్, కాలేజీ ఎడ్యుకేషన్, టెక్నికల్ ఎడ్యుకేషన్, ఇతర శాఖల సిబ్బందికి సెలవు వర్తించనుంది. ఈ మేరకు సంబంధిత శాఖల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ



తంగడపల్లి పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులకు సూచనలు చేస్తున్న తరుణ్‌జోషి

చౌటుప్పల్ : మండల పరిధిలోని పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను గురువారం రాచకొండ అదనపు సీపీ తరుణ్‌జోషి సందర్శించారు. ఆయా కేంద్రాల్లోని బందోబస్తును పరిశీలించారు. పోలింగ్ సిబ్బంది, ఓటర్లతో మాట్లాడారు. ప్రశాంతమైన ఎన్నికల నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసు అధికారులకు సూచించారు. ఆయన వెంట సీఐ.దేవేందర్, ఎస్సై ధనుంజయ ఉన్నారు.

మునుగోడు : మండల కేంద్రంతోపాటు చీకటిమామిడి, కొంపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను గురువారం కేంద్ర ఎన్నికల పోలీస్ పరిశీలకుడు విజయసింగ్ మీనా తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో పోలింగ్ సరళిని, పోలీస్ బందోబస్తును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీల నాయకులను పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల దూరంలో ఉంచాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. ఆయన వెంట నల్లగొండ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, చండూరు సీఐ వెంకటయ్య, మునుగోడు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.


యాదాద్రిలో వైభవంగా గజవాహన సేవ



స్వామి, అమ్మవారి జోడు సేవను ఊరేగిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో గురువారం సంప్రదాయ పూజలు నిర్వహించారు. వేకువజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు.. శ్రీస్వామి, అమ్మవారికి మేల్కొపులో భాగంగా సుప్రభాతం నిర్వహించారు. అనంతరం స్వయంభూలకు నిజాభిషేకం జరిపించి, తులసీ దళాలతో అర్చించారు. అలాగే ముఖమండపంలో సువర్ణ పుష్పార్చన, అష్టోత్తర పూజలు, ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సాయంత్రం జోడు సేవోత్సవం చేపట్టారు. రాత్రి శ్రీస్వామి వారికి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

సాయి మందిరంలో హోమ పూజలు
డిండి: నల్లగొండ జిల్లా డిండి మండల కేంద్రంలోని శ్రీ షిరిడీ సాయి మందిరంలో ఈనెల 29న ప్రారంభమైన ఏకాదశ వార్షికోత్సవ ఉత్సవాల్లో భాగంగా చివరి రోజైన గురువారం లక్ష్మీ గణపతి, అష్టలక్ష్మీ హోమాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగర సంకీర్తన, కాగడ హారతి, మహాభిషేకం వంటి పూజా కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. సాయంత్రం గ్రామ పురవీధుల గుండా స్వామివారి పల్లకీ సేవ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చెర్మన్ లక్ష్మీనరసింహ, లక్ష్మీనారాయణ, పర్వత్‌రెడ్డి, రమేష్, విజయ్, వెంకటేష్, శ్రీదేవి, పద్మ, అన్నపూర్ణ, లక్ష్మీ, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.





భువనగిరిలోని రాంనగర్ పోలింగ్ కేంద్రంలో సాయంత్రం 5 గంటల తరువాత బారులుదీరిన ఓటర్లు



వలిగొండలో ఓటు హక్కు వినియోగించుకొని సిరా చూపుతున్న వృద్ధులు

పోలింగ్ ప్రశాంతం

ఈవీఎంలలో అభ్యర్థుల భవిత
- ఉమ్మడి జిల్లాలో రాత్రి పొద్దుపోయే వరకు కొనసాగిన పోలింగ్
- మధ్యాహ్నం నుంచి ఓటు వేసేందుకు బారులుదీరిన జనం
- కొన్నిచోట్ల మొరాయించిన ఈవీఎంలు, వెంటనే పరిష్కరించిన అధికారులు
- అక్కడక్కడ చెదురుమదురు ఘటనలు



సాక్షిప్రతినిధి, నల్లగొండ, సాక్షి యాదాద్రి: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అక్కడక్కడ చెదురుమదురు సంఘటనలు మినహా ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన పోలింగ్ పూర్తయింది. ఈవీఎంలలో అభ్యర్థుల భవిత నిక్షిప్తమైంది. ఆదివారం తీర్పు వెలువడనుంది. ఉమ్మడి జిల్లాలో 12 నియోజకవర్గాల్లో గురువారం ఉదయం 7 గంటలకే మొదలైన పోలింగ్ రాత్రి పొద్దుపోయే వరకు కొనసాగింది. సాయంత్రం 5 గంటలకే పోలింగ్ సమయం ముగిసినా, అప్పటికే పోలింగ్ స్టేషన్లలో క్యూ లైన్లలో ఉన్న వారందరికీ ఓటు వేసే అవకాశం కల్పించారు. అక్కడక్కడ ఈవీఎంలు మొరాయించగా అధికారులు వాటిని సరిచేయడంలో అరగంట, గంటపాటు పోలింగ్ ఆలస్యమైంది. మరికొన్ని చోట్ల ఈవీఎంలు పనిచేయకపోవడంతో రిజర్వులో ఉన్నవాటిని తెప్పించి పోలింగ్ కొనసాగించారు. ఉదయం వేళలో పోలింగ్ మందకొడిగా సాగినా మధ్యాహ్నం తర్వాత ఊపందుకుంది. కొన్నిచోట్ల అభ్యర్థుల తరఫునుంచి డబ్బులు అందకపోవడంతో ఓటర్లు పోలింగ్ బూత్‌లకు రాలేదని, అవి అందాకే పోలింగ్ కేంద్రాలకు బారులుదీరినట్లు తెలిసింది. వివిధ పార్టీల అభ్యర్థులు ఉదయమే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఉమ్మడి జిల్లాలో 85.98 శాతం పోలింగ్ నమోదు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 85.98 శాతం పోలింగ్ నమోదైంది. 12 నియోజకవర్గాల్లో 29,00,250 మంది ఓటర్లు ఉండగా ఉండగా, 24,93,613 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఆలేరులో లాఠీఛార్జీ

- ఆలేరు నియోజక వర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి గొంగిడి సునీత భర్త గొంగిడి మహేందర్‌రెడ్డి గులాబి కండువా కప్పుకొని పోలింగ్ బూత్‌లోకి వెళుతుండగా కాంగ్రెస్ నాయకులు అభ్యంతరం తెలుపడంతో పాటు నినాదాలు చేశారు. దీంతో బీఆర్‌ఎస్ కార్యకర్తలు కూడా నినాదాలు చేశారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ శ్రేణులు అడ్డుకోవడం, ఆ గుంపులో గుర్తు తెలియని వారు రాళ్లు రువ్వారు. దీంతో మహేందర్‌రెడ్డి కారు అద్దాలు పగిలాయి. వెంటనే ఏసీపీ శివరాంరెడ్డి అక్కడకు చేరుకుని మహేందర్‌రెడ్డిని పంపించారు. అయినా ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరగడంతో పోలీసులు లాఠీచార్జి చేసి వారిని చెదరగొట్టారు.

రాత్రి వరకు కొనసాగిన పోలింగ్
సాధారణంగా పోలింగ్ సాయంత్రం 5 గంటలకు ముగియాల్సి ఉంది. మధ్యాహ్నం తరువాత ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు అధికంగా రావడంతో పోలింగ్ సమయం పూర్తయినప్పటికీ చాలా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు బారులుదీరారు. దీంతో ఎన్నికల సిబ్బంది అయిదు గంటల వరకు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఓటర్లందరికీ ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు. దీంతో రాత్రి వరకు పోలింగ్ కొనసాగింది.

దేవరకొండలో దాడి

- దేవరకొండ నియోజకవర్గంలోని చందంపేట మండలం కోరుట్ల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ పోలింగ్ ఏజెంట్‌కు, ఆ గ్రామ సర్పంచ్‌కు పోలింగ్ బూత్ వద్ద స్వల్ప వివాదం జరిగింది. దానిని దృష్టిలో పెట్టుకుని సాయంత్రం పోలింగ్ ఏజెంట్ సోదరుడితో పాటు ఆరుగురిపై సర్పంచ్ అనుచరులు దాడిచేశారు.
- హుజూర్‌నగర్‌లో ఎమ్మెల్యే సైదిరెడ్డి గులాబీ కండువా కప్పుకుని పోలింగ్ బూత్‌లోకి వెళుతుండగా పోలీసు సిబ్బంది కండువా తీసి వెళ్లాలంటూ అడ్డుకున్నారు. ఈ క్రమంలో స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది.
- తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ గులాబీ కండువాతో మోత్కూరులోని పోలింగ్ కేంద్రంలోకి వెళుతుండగా కాంగ్రెస్ నాయకులు అభ్యంతరం తెలుపడంతో స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో పోలీసులు కార్యకర్తలను చెదరగొట్టారు.
- మిర్యాలగూడ రెడ్డికాలనీ, బంగారుగడ్డ పోలింగ్ బూత్‌ల వద్ద బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల గొడవతో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది.
- అడవిదేవులపల్లి మండలం చాంప్లతండా వద్ద కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కార్యకర్తల మధ్య స్వల్ప ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసులు జోక్యం చేసుకోవడంతో సద్దుమణిగింది.
- వేములపల్లి మండలం ఆమనగల్లు, లక్ష్మీదేవిగూడెం, శెట్టిపాలెం, మొల్కపట్నం, వేములపల్లి గ్రామాల్లో ఇరు పార్టీ కార్యకర్తల మధ్య గొడవలు తలెత్తగా పోలీసులు వారిని చెదరగొట్టారు.



భూదాన్‌పోచంపల్లిలోని పోలింగ్ కేంద్రంలో లైన్‌లో నిల్చున్న ఓటర్లు

మొరాయించిన ఈవీఎంలు

మిర్యాలగూడ నియోజకవర్గంలో పోలింగ్ ప్రారంభమైన మొదట్లోనే పట్టణంలోని బంగారుగడ్డలో గల 120వ పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించింది. దీంతో అధికారులు దాన్ని సరిచేయడంతో తిరిగి పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. మాడిసన్ స్కూల్‌లో పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించడంతో అరగంట పాటు పోలింగ్‌లో జాప్యం జరిగింది.

- కోదాడలోని 193వ పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించగా గంటసేపు పోలింగ్ నిలిచిపోయింది. ఆ తర్వాత దాన్ని అధికారులు సరిచేయడంతో తిరిగి ప్రారంభమైంది.
- నాగార్జునసాగర్ నియోజకవర్గ పరిధిలోని హాలియా సమీపంలో గల ఇబ్రహీంపేటలో 169 పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించడంతో గంట సేపు పోలింగ్ నిలిచింది. దీంతో కొత్త ఈవీఎం తెచ్చి అధికారులు పోలింగ్ కొనసాగించారు. త్రిపురారం మండలంలోని బాబుసాయిపేటలో 269 పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించింది. కొద్దిసేపు తర్వాత తిరిగి పనిచేసింది. త్రిపురారం మండల కేంద్రంలో 271 పోలింగ్ కేంద్రంలో ఈవీఎం కొద్ది సేపు మొరాయించగా పోలింగ్ నిలిచింది. ఎన్నికల అధికారులు దాన్ని సరిచేయడంతో పోలింగ్ సజావుగా కొనసాగింది.
- హుజూర్‌నగర్ నియోజకవర్గంలో అంబేద్కర్ కాలనీ స్కూల్‌లో ఈవీఎంలు పనిచేయకపోవడంతో కొద్ది సేపు పోలింగ్ ఆలస్యమైంది.
- నకిరేకల్ నియోజకవర్గంలోని చిట్యాల మండలంలో 60వ పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించడంతో అరగంట పాటు పోలింగ్ నిలిచిపోయింది. అదే మండలం వెలికట్ట గ్రామ పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మిషన్ ఆగిపోవడంతో మరో మిషన్ తెప్పించిన అధికారులు పోలింగ్ కొనసాగించారు.
- భువనగిరి నియోజకవర్గంలోని పోచంపల్లి మండలం వంకమామిడి గ్రామంలో ఈవీఎం మొరాయించడంతో అరగంట పాటు పోలింగ్ నిలిచిపోయింది. అధికారులు దాన్ని సరిచేయగా తిరిగి ప్రారంభమైంది.
- మునుగోడు నియోజకవర్గ కేంద్రంలోని 33వ పోలింగ్‌బూత్‌లో ఉదయం పోలింగ్ ప్రారంభ సమయంలో ఈవీఎం మొరాయించి గంటసేపటి తర్వాత ప్రారంభమైంది. సంస్థాన్ నారాయణపురం మండలంలోని దాకుతండా, గాంధీనగర్‌తండా, రాధానగర్‌తండాల్లో కొంత సేపు ఈవీఎంలు మొరాయించాయి. మర్రిగూడ మండలం ఎర్రగండ్లపల్లి పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించాయి. అదే మండలం రాంరెడ్డిపల్లిలో సాయంత్రం ఇంకో ఏడుగురు ఓటు వేయాల్సి ఉండగా వీవీ ప్యాట్ మొరాయించింది. దీంతో గంట సేపు ఆలస్యమైంది.
- దేవరకొండ నియోజకవర్గంలోని కట్టకొమ్ము తండాలో ఈవీఎం మొరాయించడంతో అరగంట పాటు పోలింగ్‌లో ఆలస్యం జరిగింది. సూర్యాపేట పట్టణంలోని 115వ పోలింగ్ బూత్‌లో సాయంత్రం 4 గంటల సమయంలో ఈవీఎం మొరాయించడంతో ఆలస్యమైంది. తరువాత సరిచేశారు. పెన్‌పహాడ్‌లోని మాచారంలో మాక్ పోలింగ్ సమయంలో ఈవీఎం మొరాయించింది.

కట్టుదిట్టంగా ఏర్పాట్లు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లాల ఎన్నికల అధికారులతో పాటు ఆర్‌ఓలు కూడా పక్కా ఏర్పాట్లు చేశారు. ఎక్కడా రీపోలింగ్‌కు అవకాశం లేకుండా గొడవలను నియంత్రిస్తూ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. మొత్తానికి ఉమ్మడి జిల్లాలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. దీంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.



నియోజకవర్గాల వారీగా ఓటర్లు, పోలింగ్ వివరాలు

నియోజకవర్గం	ఓటర్లు	పోలైన ఓట్లు	శాతం
దేవరకొండ	2,51,622	2,11,236	83.95
నాగార్జునసాగర్	2,33,412	1,99,753	85.58
మిర్యాలగూడ	2,31,391	1,93,142	83.47
నల్లగొండ	2,44,460	1,99,234	81.5
మునుగోడు	2,52,648	2,31,197	91.51
నకిరేకల్	2,50,547	2,17,149	86.67
సూర్యాపేట	2,41,799	1,93,318	79.95
తుంగతుర్తి	2,55,017	2,23,163	87.51
హుజూర్‌నగర్	2,47,592	2,13,702	86.31
కోదాడ	2,41,554	2,06,377	85.44
ఆలేరు	2,33,267	2,10,313	90.16
భువనగిరి	2,16,941	1,95,029	89.9

మధ్యాహ్నం తరువాత బారులుదీరిన ఓటర్లు
ఉదయం పోలింగ్ కాస్త మందకొడిగా సాగినా, మధ్యాహ్నం నుంచి ఊపందుకుంది. నల్లగొండతోపాటు మరికొన్ని ప్రాంతాల్లో కొందరు అభ్యర్థులు ఓటుకు డబ్బులు పంపిణీ చేయటం, మరికొందరు అభ్యర్థుల నుంచి డబ్బులు పంపిణీ కాకపోవడతంతో కొన్ని ప్రాంతాల్లో ఓటర్లు వాటి కోసం ఎదురు చూసినట్లు తెలిసింది. చివరకు ఎదుటి పార్టీ వారి నుంచి డబ్బులు అందాకే ఒక్కసారిగా పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు వచ్చినట్లు సమాచారం. దీంతో మధ్యాహ్నం తరువాత పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు బారులు తీరారు.



చౌటుప్పల్‌లో ఓటు వేసేందుకు వీల్‌చైర్‌పై వృద్ధుడిని తీసుకువస్తున్న సహాయకుడు




రాజాపేట మండలం రేణికుంటలో ఓటు వేసిన నూతన ఓటర్లు



భువనగిరిలోని అరోరా ఇంజినీరింగ్ కళాశాల డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఎన్నికల అధికారులకు ఈవీఎంలు, పోలింగ్ సామగ్రి అందజేస్తున్న పోలింగ్ సిబ్బంది

ఎన్నికల్లో ధన ప్రవాహం!

- జిల్లాలో రూ.122 కోట్ల పైనే ఖర్చు
- పోటీపడి డబ్బులు పంపిణీ చేసిన అభ్యర్థులు



సాక్షి, యాదాద్రి : అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ పార్టీలు నోట్ల వరద పారించాయి. ఓటర్లను ఆకర్షించడానికి పోటీపడి ఖర్చు చేశాయి. భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు రూ.122 కోట్లపైనే పంపిణీ చేశారని సమాచారం. భువనగిరి నియోజకవర్గంలో ఓ పార్టీ లక్షా 75వేల మంది ఓటర్లకు ఒక్కొక్కరికి సగటున రూ.2,500 చొప్పున రూ.43.75 కోట్లు పంచినట్లు తెలుస్తోంది. ఇదే నియోజకవర్గంలో పోటీలో ఉన్న మరో ప్రధాన పార్టీ ఓటుకు రూ.2వేల చొప్పున రూ.35 కోట్లు పంపిణీ చేశారని సమాచారం. ఇక ఆలేరు నియోజకవర్గంలో ఓ ప్రధాన పార్టీ లక్షా 75వేల మందికి రూ.1,500 చొప్పున రూ.26.25 కోట్లు పంపిణీ చేశారన్న ప్రచారం ఉంది.ప్రత్యర్థి సైతం ఓటుకు రూ.1,000 చొప్పున రూ.17.50 కోట్లు పంపిణీ చేశారు. వీరితో పాటు బరిలో ఉన్న ఓ జాతీయ పార్టీ అభ్యర్థులు ఖర్చుకు వెనుకాడలేదు.

డబ్బులు ఇస్తేనే ఓటు ..

ఓటర్లు సైతం పలు చోట్ల డబ్బులు ఇచ్చిన తరువాతే ఓటు వేయడానికి కదలినట్లు తెలుస్తోంది. డబ్బులు ఇవ్వని నేతలను నిలదీశారు. భువనగిరి నియోజకవర్గంలో డబ్బులు అందలేదని పలుచోట్ల నాయకులకు ఓటర్లు ఫోన్ చేసి మరీ రప్పించారు. మధ్యాహ్నం డబ్బులు అందిన తర్వాత పోలింగ్ కేంద్రాలకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. డబ్బులు అందని ఓటర్లు పోలింగ్‌కు ఆసక్తి చూపకపోవడంతో మరోసారి పంపిణీ చేసి పోలింగ్ కేంద్రాలకు తీసుకువచ్చారు.బస్వాపురం, భువనగిరి పట్టణంతో పాటు మరికొన్ని చోట్ల డబ్బుల కోసం గొడవలకు దిగారు. ఆలేరు నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి కొనసాగింది. రెండు ప్రధాన పార్టీలతో పాటు మరో ఇద్దరు అభ్యర్థులు డబ్బుల పంపిణీలో పోటీ పడ్డారు. ఇంత ఖర్చు చేసినా చివరికి ఎవరు గట్టెక్కుతారో మరో రెండు రోజులు వేచి చూడాల్సిందే.

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు
- కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్ : ఈ ఎన్నికల్లో ప్రజలంతా మార్పు కోరుకుంటున్నారని మునుగోడు కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజలంతా ఏకపక్ష తీర్పు ఇవ్వబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు. చౌటుప్పల్ పట్టణంలోని బాలికల గురుకులం, జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. పోలింగ్ సరళిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తీసుకునే నిర్ణయంతో మంచి భవిష్యత్తు ఉండబోతుందన్నారు. పెద్ద మనసుతో తనకు ఓటు వేసి అండగా నిలిచిన మునుగోడు నియోజకవర్గ ప్రజలకు జన్మంతా రుణపడి ఉంటానన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, కౌన్సిలర్లు కామిశెట్టి శైలజభాస్కర్, సందగళ్ల విజయ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ పిల్లలమర్రి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.


సూర్యాపేటలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేసిన మంత్రి జగదీశ్‌రెడ్డి


రాజాపేట: ఓటు వేసిన మోత్కుపల్లి నర్సింహులు


నల్లగొండలో కుటుంబ సభ్యులతో కలసి ఓటు వేసిన మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి



నల్లగొండలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేసిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


నాగార్జునసాగర్‌లో ఓటు వేసిన సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి దంపతులు


కోదాడలో ఓటేసిన ఉత్తమ్, పద్మావతిరెడ్డి


సూర్యాపేటలో ఓటేసిన ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్


యాదగిరిగుట్ట: వంగపల్లిలో ఓటు వేసిన విప్ గొంగిడి సునీత కుటుంబ సభ్యులు


ఓటేసిన మిర్యాలగూడ సీపీఎం అభ్యర్థి జూలకంటి రంగారెడ్డి కుటుంబ సభ్యులు


కుమారుడితో కలిసి ఓటేసిన చాడ కిషన్‌రెడ్డి


ఓటేసిన భువనగిరి బీజేపీ అభ్యర్థి నారాయణరెడ్డి


ఓటు వేసిన ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా


ఓటు వేసిన నల్లగొండ కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్


ఓటేసిన సూర్యాపేట అదనపు కలెక్టర్ ప్రియాంక


ఓటు వేసిన సూర్యాపేట కలెక్టర్ వెంకట్రావు



ఓటు వేసిన నల్లగొండ ఎస్పీ అపూర్వరావు




నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలో తొలిసారి ఓటు హక్కు వినియోగించుకొని సిరా గుర్తు చూపుతున్న యువతులు



నల్లగొండ మండలం అనంతారంలో బారులుదీరిన ఓటర్లు


చండూరులోని మార్కెట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో రాత్రి వరకు కొనసాగిన క్యూ


నల్లగొండలో ఎన్నికల అధికారులకు ఈవీఎం బాక్సులను అందజేస్తున్న సిబ్బంది


ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ నార్కట్‌పల్లిలోని హైస్కూల్ వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తున్న యువకుడు



నల్లగొండలోని స్ట్రాంగ్‌రూంకు ఈవీఎంలను తరలిస్తున్న సిబ్బంది


యాదగిరిగుట్ట మండలం మల్లాపురం గ్రామంలో ఓటు వేసేందుకు బారులుదీరిన ఓటర్లు


యాదగిరిగుట్ట మండల మల్లాపురంలో ఓటు వేయించేందుకు వృద్ధురాలిని తీసుకెళ్తున్న యువకుడు


నల్లగొండలో వీల్‌చైర్‌లో దివ్యాంగుడిని పోలింగ్ కేంద్రానికి తీసుకొస్తున్న కుటుంబ సభ్యులు


భూదాన్ పోచంపల్లి: ఓటు హక్కు వినియోగించుకుని సిరా గుర్తు చూపిస్తున్న యువతులు


చివ్వెంల మండలం వట్టిఖమ్మంపహాడ్ గ్రామంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు క్యూ లైన్‌లో నిల్చున్న మహిళా ఓటర్లు



భువనగిరి మండలం బస్వాపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో ఓట్లు వేసేందుకు బారులుదీరిన ఓటర్లు

సొంతూళ్లకు ఓటర్లు.. హైవేలపై వాహనాల రద్దీ


చౌటుప్పల్‌లో జాతీయ రహదారిపై బారులుదీరిన వాహనాలు


బీబీనగర్: ఎయిమ్స్ సమీపంలో హైవేపై నిలిచిన వాహనాలు

చౌటుప్పల్: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో నివాసముండే ఓటర్లు గురువారం తమ సొంతూళ్లకు వెళ్లడంతో హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ నెలకొంది. ఉదయం వాహనాల రద్దీ ఎక్కువగా ఉండగా.. సాయంత్రం కొంత మేర తగ్గింది. పోలింగ్ ముగిశాక ఓటర్లు తిరుగు ప్రయాణమవ్వడంతో మళ్లీ రాత్రి రద్దీ ఎక్కువైంది. దీంతో వాహనాలు నెమ్మదిగా ముందుకు సాగాయి. ఓ వైపు వాహనాల రద్దీ, మరో వైపు ఓటు వేసేందుకు స్థానికుల రాకపోకల కారణంగా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని జంక్షన్‌ల వద్ద స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

వరంగల్ హైవేపై..

బీబీనగర్: ఓట్లు వేసేందుకు ఓటర్లు జనగామ, హన్మకొండ, ఆలేరు, యాదగిరిగుట్ట, వరంగల్ తదితర ప్రాంతాలకు కార్లు, బైకులు, బస్సుల్లో భారీగా తరలిరావడంతో కొండమడుగు మెట్టు నుంచి గూడూరు టోల్‌ప్లాజా వరకు వాహనాలు నాలుగు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. దీంతో హైవే సిబ్బంది వాహనాలను సర్వీస్ రోడ్డు గుండా వాహనాలను మళ్లించారు. ఒక్కో వాహనం టోల్‌ప్లాజా గుండా వెళ్లేందుకు అరగంటకు పైగా సమయం పట్టింది. సాయంత్రం నుంచి ప్రజలు ఓట్లు వేసి తిరుగు ప్రయాణం కావడంతో భువనగిరి వైపు పగిడిపల్లి వరకు వాహనాలు బారులుదీరాయి.

ఈస్ట్‌కోస్ట్ ట్రైన్‌లో పొగలు

- ఎయిర్‌పైప్ పగిలిపోవడమే కారణం

యాదగిరిగుట్ట రూరల్: మండలంలోని వంగపల్లి గ్రామ సమీపంలో ఈస్ట్‌కోస్ట్ ట్రైన్‌లోని ఓ బోగిలో పొగలు వ్యాపించాయి.. హైదరాబాద్ నుంచి వరంగల్ వైపు ఈస్ట్ కోస్ట్ రైలు గురువారం ఉదయం 10 గంటల సమయంలో వెళుతుంది. యాదగిరిగుట్ట మండలం వంగపల్లి రైల్వే స్టేషన్‌కు రాగానే రైలులోని ఓ బోగిలో ఎయిర్‌పైప్ పగిలి దట్టమైన పొగలు వ్యాపించాయి. దీంతో ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. అప్రమత్తమైన పైలట్ ట్రైన్ ఆపడంతో, ప్యాసింజర్‌లు బయటకు పరుగులు పెట్టారు. వెంటనే రైల్వేశాఖ సిబ్బంది పగిలిన ఎయిర్‌పైప్‌కు మరమ్మతులు చేశారు. దీంతో ఈస్ట్‌కోస్ట్ రైలు వరంగల్‌కు వెళ్లిపోయింది.


వంగపల్లి వద్ద రైలులో నుంచి కిందకు దిగుతున్న ప్రయాణికులు

ఎస్కార్ట్ లేకుండానే ఈవీఎంల తరలింపు


తుంగతుర్తిలో సెక్టోరియల్ అధికారి కారును ధ్వంసం చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు


తుంగతుర్తిలో ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

- ఈవీఎంలు మార్చేందుకు ప్రయత్నించారంటూ తుంగతుర్తిలో కాంగ్రెస్ కార్యకర్తల ఆందోళన
- సెక్టోరియల్ అధికారి కారు అద్దాలు ధ్వంసం
- నాగారం మండలం పేరబోయినగూడెంలో ఉద్రిక్తత

నాగారం : నాగారం మండలం పేరబోయినగూడెంలో గురువారం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసిన తర్వాత అధికారులు ఎస్కార్ట్ లేకుండా ఈవీఎంలను తరలిస్తుండటంతో గ్రామస్తులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. పేరబోయినగూడెం గ్రామంలో సాయంత్రం 5:10గంటలకు పోలింగ్ ముగిసింది. అధికారులు ఎస్కార్ట్ లేకుండానే ఈవీఎం బాక్సులను మినీ బస్సులో ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న నరసింహులగూడెం వరకు తరలించారు. అదే మాదిరిగా నరసింహులగూడెంలో ఉన్న ఈవీఎంను కూడా మినీ బస్సులో తరలించేందుకు ప్రయత్నించారు. ఇదే సమయంలో సెక్టోరియల్ అధికారి అదనపు ఈవీఎంలను తన కారులో వేసుకుని నర్సింహులగూడేనికి చేరుకున్నాడు. ఇదే సమయంలో కాంగ్రెస్ కార్యకర్తలు, గ్రామస్తులు కారులో ఉన్న ఖాళీ ఈవీఎంలను గమనించి ఎక్కడివి అని ప్రశ్నించారు. ఈ క్రమంలో సెక్టోరియల్ అధికారి అదనపు ఖాళీ ఈవీఎంలు అని చెప్పే ప్రయత్నం చేస్తుండగానే ఎస్కార్ట్ లేకుండా ఈవీఎం బాక్సులను తరలించవద్దని ఆందోళనకు దిగారు. కారులో ఉన్న ఖాళీ ఈవీఎంలు పోలింగ్ అయిన ఈవీఎంల స్థానంలో మార్చేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారంటూ ఆందోళనకు దిగారు. దీంతో సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సెక్టోరియల్ అధికారి వెంట అదనపు ఏవీఎంలు ఉంటాయని గ్రామస్తులకు వివరించే ప్రయత్నం చేశారు. అయినా ఆందోళన విరమించకుండా బాక్సులు తారుమారు చేసే కుట్ర చేస్తున్నారని అనుమానం వ్యక్తం చేశారు. అనంతరం పోలీసులు అక్కడి నుంచి ఎస్కార్ట్ వాహనం ఇచ్చి ఈవీఎంలను తరలించారు. గ్రామస్తులు అనుమానంతో ఈవీఎంలు తరలిస్తున్న వాహనాన్ని భద్రపరిచే స్థలం తుంగతుర్తి వరకు వెంబడించారు.

సెక్టోరియల్ అధికారి కారు అద్దాలు ధ్వంసం

తుంగతుర్తి గోదాం ఎదుట కాంగ్రెస్ కార్యకర్తలు అధికసంఖ్యలో గుమిగూడి ఈవీఎంలు తరలిస్తున్న సెక్టోరియల్ అధికారి కారును అడ్డగించారు. అనంతరం కారు అద్దాలను ధ్వంసం చేశారు. తమ ఎదుట ఖాళీ ఈవీఎంలను ఓపెన్ చేయాలని ఆందోళనకు దిగారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు వారిని అదుపుచేసి ఈవీఎంలను గోదాముకు తరలించారు. ఈ విషయంపై తమకు వివరణ ఇవ్వాలని కార్యకర్తలు ఆర్వో వెంకట్‌రెడ్డి, డీఎస్పీ రవిలను కోరారు. దీంతో వారు కాంగ్రెస్ నాయకులకు, ఏజెంట్ల ఎదుట ఖాళీ ఈవీఎంలను తెరిచి వారి అనుమానాన్ని నివృత్తి చేశారు.

డీసీసీబీ చైర్మన్ కారుపై కాంగ్రెస్ శ్రేణుల రాళ్లదాడి

- ఆలేరు మండలం కొలనుపాకలో ఉద్రిక్తత, లాఠీచార్జ్

ఆలేరురూరల్ : అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా గురువారంఆలేరు మండలం కొలనుపాక ఉద్రిక్తత చోటు చేసుకుంది. కొలనుపాకలోని పోలింగ్ బూత్‌లోకి డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి వెళ్లేందుకు ప్రయత్నించగా కాంగ్రెస్ శ్రేణులు ఆయనను అడ్డుకున్నారు. దీంతో రెండు పార్టీల కార్యకర్తలు వాగ్వాదం చేసుకున్నారు. అనంతరం డీసీసీబీ చైర్మన్ అక్కడి నుంచి కారులో వెళ్లిపోతుండగా కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు రాళ్లు విసిరారు. దీంతో కారు అద్దాలు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో కేంద్రబలగాలు లాఠీలకు పని చెప్పారు. రెండు పార్టీల కార్యకర్తలను కేంద్ర బలగాలు చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

గాదరి కిశోర్‌ను అడ్డుకున్న కాంగ్రెస్ నేతలు

శాలిగౌరారం : ఓటింగ్ సరళిని పరిశీలించేందుకు శాలిగౌరారం మండలం మాధారంకలాన్‌లోని పోలింగ్ కేంద్రంలోకి వెళ్తున్న తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌ను కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారు. దీంతో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ కార్యకర్త చేతికి గాయాలయ్యాయి. పోలీసులు వెంటనే ఇరువర్గాల నాయకులు, కార్యకర్తలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. అదే విధంగా మండలంలోని ఊట్కూరు, బాలిశెట్టిగూడెం, తిరుమలరాయునిగూడెం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లను ప్రభావితం చేస్తున్నారనే విషయాలపై బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌పార్టీల కార్యకర్తలు తీవ్ర వాగ్వాదాలకు దిగారు. ఇరువర్గాల మధ్య తోపులాట, ఘర్షణ చోటుచేసుకుంది. పోలీసు బృందాలు ఇరుపార్టీల కార్యకర్తలను చెదరగొట్టి పోలింగ్ కేంద్రాలకు నిర్ణీత దూరంగా తరిమివేశారు.

కోరుట్లలో ఘర్షణ.. ఆరుగురికి గాయాలు




ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కాంగ్రెస్ కార్యకర్తలు

చందంపేట : అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా గురువారం చందంపేట మండలం కోరుట్ల గ్రామంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీ నాయకుల మధ్య ఘర్షణ చోటు చేసుకోగా కాంగ్రెస్ పార్టీకి చెందిన ఐదుగురికి గాయాలయ్యాయి. కాంగ్రెస్ పార్టీకి చెందిన జాలె నర్సింహారెడ్డి ఎన్నికల పోలింగ్ బూత్ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నాడు. కోరుట్ల పోలింగ్ బూత్‌ను సందర్శించిన క్రమంలో గ్రామ సర్పంచ్ మల్లారెడ్డితో స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం సాయంత్రం జాలె నర్సింహారెడ్డి సోదరుడు జాలె తిలక్‌రెడ్డితో పాటు మరికొందరు కోరుట్ల గ్రామానికి వెళ్లారు. కోపోద్రిక్తులైన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు వారిపై ఇనుపరాడ్లతో దాడి చేశారు. దాడిలో తిలక్‌రెడ్డితో పాటు మరో ఐదుగురు కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్తలకు తీవ్ర, బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన గునుగుండ్ల గోవిందుకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం దేవరకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

నర్సింహాపురంలో రైతుపై ఎస్‌ఐ దాడి


ఎస్‌ఐ దాడిలో గాయపడిన కృష్ణ

మునగాల(కోదాడ): మండలంలోని నర్సింహాపురంలో గురువారం ఓ రైతుపై చిలుకూరు ఎస్‌ఐ దాడి చేసి గాయపర్చాడు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నర్సింహాపురం గ్రామానికి చెందిన రైతు పుల్లూరు కృష్ణ (ఐదవ వార్డు సభ్యుడు) తన వరిపొలం కోసి ధాన్యాన్ని గ్రామంలో ఉన్న పుల్లూరి వెంకటనారాయణ –అరుణ కళావేదిక ఆవరణలో ఆరబోసి కాపలగా ఉన్నాడు. ఎన్నికల విధుల్లో ఉన్న చిలుకూరు ఎస్‌ఐ చల్లా శ్రీనివాస్‌యాదవ్ గ్రామంలోని పోలింగ్ కేంద్రం వద్ద ఉన్న కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కార్యకర్తలను చెదరగొట్టాడు. అనంతరం ధాన్యానికి కావలాగా ఉన్న రైతు కృష్ణ వద్దకు వచ్చి ఇక్కడి నుంచి దూరంగా వెళ్లాలని ఆదేశించాడు. దీంతో సదరు రైతు ధాన్యం వద్ద కాపాలా ఉన్నాను అని సమాధానం ఇవ్వడంతో ఎస్‌ఐ దౌర్జన్యంగా దూరంగా పో అంటూ కాలర్ పాటి కొద్ది దూరం లాక్కొని వెళ్లాడు. తనపై ఎందుకు దౌర్జన్యం చేస్తున్నారని ప్రశ్నించిన రైతుపై ఎస్‌ఐ మరోసారి దాడి చేయడంతో మోకాళ్లకు గాయాలయ్యాయి. దీంతో గ్రామస్తులు సదరు ఎస్‌ఐని చుట్టుముట్టి అకారణంగా ఓ రైతుపై ఎందుకు దౌర్జన్యం చేశావని ఎదురుతిరిగారు. దీంతో ఎస్‌ఐ నేను తొందరపడ్డాను క్షమించండి అంటూ అక్కడ నుంచి మెల్లగా జారుకున్నాడు. అకారణంగా రైతుపై దాడిచేసిన ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోదాడ డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. విషయాన్నికాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎన్.పద్మావతి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆమె రైతును ఫోన్‌లో పరామర్శించి సదరు ఎస్‌ఐపై చర్యలు తీసుకునే విధంగా పోలీసు అధికారులపై ఒత్తిడి తీసుకువస్తామని హామీ ఇచ్చారు.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య ఘర్షణ

మునుగోడు: మండలంలోని ఊకొండి గ్రామ పోలింగ్ కేంద్రం వద్ద గురువారం బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య ఘర్షణ జరిగింది. కాంగ్రెస్ నాయకులు పోలింగ్ కేంద్రానికి వచ్చే ఓటర్లను చెయ్యి గుర్తుకు ఓటువేయాలని పలువురు మహిళలకు కూలి డబ్బులు ఇస్తామని ప్రచారం చేయించారు. గమనించిన బీఆర్‌ఎస్ నాయకులు వారి కంటే అధికంగా కూలి డబ్బులు ఇస్తామని చెప్పడంతో ఆ మహిళలు అటూ వెళ్లగా కాంగ్రెస్ నాయకులు ఆగ్రహించి దూషణకు దిగారు. దీంతో ఇరు పార్టీ నాయకుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసులు జోక్యం చేసుకొని ఇరువర్గాలను అక్కడి నుంచి చెదరగొట్టారు.